NPR01F334
C

విప్లవాత్మ

[గేయగుచ్ఛం]

ప్రజా పుస్తక నిలయం,
కంకిపాడు. (కృష్ణా)

894.8271

కవి

నార్ల చిరంజీవి

C7

NPR01F334

విప్లవాత్మ

★

కృష్ణాజిల్లా పెనమలూరు గ్రామస్థులు
చిగురుపాటి బుచ్చిరామయ్య గారు
డా॥ చంద్రశేఖర్ గారు
ప్రోత్సాహకరించిన పుస్తకం

కవి:

నార్ల చిరంజీవి

జనవరి 1946

ఎనిమిది అణాలు

894.8271
చి. సా. — ౭

ప్రతులు 2000

పరిచయం

ఆధునిక ప్రపంచ సహవాసంవల్ల తెలుగు జాతీయ సంస్కృతి పునర్వికాసం పొందుతూన్నది. ఆంధ్ర జాతీయోద్యమం, భారత స్వాతంత్ర్యోద్యమం, చదువుకున్నవారిలో చైతన్యం జాగృతి సేవాభిలాష కలిగించాయి.

ఇలాంటి సేవాభిలాషులు ప్రజాసామాన్యంలో చైతన్యం పెంపొందించడానికి కృషి చేస్తున్నారు. కార్మికులు, రైతులలో పనిచేస్తూ పీడిత ప్రజావుద్యమాలను నిర్మించుతున్నారు.

ఈ పీడిత ప్రజాఉద్యమాలు అనేకమంది యువకులలో ఉత్సాహం, అనుభూతికలిగించుతున్నాయి. కవులు, గాయకులు, రచయితలు తయారవుతున్నారు. అట్టివారిలో మా నార్ల చిరంజీవి ఒకరు.

ఈ చిన్ని పుస్తకంలో చిరంజీవి రచించిన 19 పాటలు ఉన్నాయి. వీటిలో కొన్ని యిదివరకే పత్రికలలో ప్రకటితమయ్యాయి. కొన్ని సరికొత్తవి. కొన్ని ప్రచారంలోకివచ్చాయి. ప్రజాసామాన్యంయొక్క ఆదరణ పొందాయి. విరివిగా పాడబడుతున్నాయి.

'తెలుగుతల్లి,' 'మా కృష్ణరాయా' పాటలలో రచయిత తనకు వున్న ఆంధ్రాభిమానము వ్యక్తపరచాడు. ఆయన ఆసించే భవిష్యదాంధ్రజాతి రూపురేఖలను వర్ణించాడు.

'వంగరాష్ట్రమా,' 'విశాఖవేదన,' 'ధాన్యలక్ష్మి' 'మాదాకవళం' అనుపాటలలో అన్నార్తుల ఘోషచూచి రచయిత హృదయం ఎలా కరిగిపోయిందో వ్యక్తమవుతుంది.

విశాఖ కరువునివారణకృషిలో పాల్గొనడానికి వెళ్ళిన ప్రజాసేవకులలో యీ కవికూడ ఒకడు. ఆ రోజులలోనే ' విశాఖవేదన ' అనుపాటను రమ్యంగా వ్రాశాడు.

ప్రజారాజ్యమైన సోవియట్ యూనియన్‌ను గురించి, లోకవిపత్తును ఆపిన ఎర్రసైన్యాన్ని కీర్తించుతూ పాటలుకూడ ఇందులోవున్నాయి. కార్మికులను ఉద్బోధించే ' మేదినోత్సవం ' పాట, ' ఎర్రజెండా ' పాటా వున్నాయి.

చిరంజీవి పాటలను నేను ఎక్కువగా తరచనక్కరలేదు. చదివి సంతసించే పాఠకులు, పాడి ఆనందింపచేసే గాయకులు, విని హృదయాలుప్పొంగే ప్రజలు, వారే చిరంజీవి రచనలకు విలువ గట్టగలిగిన పరీక్షాధికారులు.

రచయిత యిప్పటివలెనే ప్రజాసేవచేస్తూ, ప్రజలను రంజింపజేసే రచనలను మరిన్ని వ్రాస్తూ చిరంజీవి అవ్వాలని ఆశిస్తున్నాను.

మద్దుకూరి చంద్రశేఖరరావు

★

కృతజ్ఞత

★

సాదరాభిమానాలతో నా గీతాల్ని ప్రకటిస్తూ వచ్చిన 'ప్రజాశక్తి' 'తెలుగుతల్లి' ప్రతికా సంపాదకులకు నా కృతజ్ఞతాంజలులు.

ఈ గేయాల్ని చదివి తమ అభిప్రాయాన్ని వ్రాసి ఇచ్చిన శ్రీ మద్దుకూరి చంద్రశేఖరరావు గారికి కృతజ్ఞుణ్ణి. ప్రచురణాది విషయాల్లో సహాయంచేసిన స్నేహసమితికి నమస్కారాలు.

— చిరంజీవి

విషయసూచిక

1.	తెలుగుతల్లి	....	1
2.	మా కృష్ణరాయా!	....	3
3.	స్వాగతం	....	5
4.	కాంక్ష	....	8
5.	విప్లవాత్మ	....	9
6.	వంగరాష్ట్రమా!	....	11
7.	విశాఖ వేదన	....	12
8.	ధాన్యలక్ష్మి	....	15
9.	మాదాకవళం	....	17
10.	నవోజ్జ్వల యుగారంభం	....	18
11.	నవంబరు 7	....	20
12.	జైత్రయాత్ర.	....	22
13.	అరుణపతాక	....	24
14.	సోదరా!	....	26
15.	పెద్దోడా!	....	28
16.	నాంది	....	30
17.	పదండి ముందుకు!	....	32
18.	అనంతయాత్ర	....	33
19.	మేదినోత్సవం.	....	35

తెలుగుతల్లి

ఏ వేళలోనైన ఎచ్చోటనైనా
నా దేశ మీ జాతి భాష నా దనుచు
వీరాంధ్ర తేజస్సు వెల్లివిరియగ
పాలగొంతులు విప్పి పాడరా పదము।

అందాలు చిందేటి అమరావతియు
రాగాలు పలికేటి హంపి చిత్రాలు
కళలు వర్షించు నాగార్జునునికొండ
శిల్ప నీ రాజిరా తెలుగు లక్ష్మికి।

తుంగభద్రా పెన్న కృష్ణ గౌతమి
గంగలీ నేలలో కదలి పారేను।
తెలుగు జెండాలెత్తి తిరిగెరా ఓడ
సాటి దేశాలకై సరుకులందింప

కాక తీరిన వీర కాకతేయుల
పదను కత్తులవేడి చల్లార లేదోయ్
కృష్ణరాయాంధ్ర విఖ్యాత వీరాళి
క్షాత్ర తేజము పొంగి పొరలెరాయిచట।

తిక్కనా సూరన్న దివ్యులిచ్చోట
తీయ తియ్యని తెల్గు తేనెలస్గురియ
గురజాడ శ్రీ గిడుగు లిచటనే
నిర్మించి నారోయి నీ జీవ భాష

ఇట్టి పుణ్యాంధ్రలో బుట్టినామోయి
ప్రాంతీయ భేదాలు వలదోయి మనకు
ఐక్యాంధ్ర జాతికై యహరహమ్ములు
సంకల్ప దీక్షతో సాధింపవోయి ।

విశ్వ విద్యాలయాల్ విరివిగా పెంచి
విజ్ఞాన క్షేత్రముల్ వెలయింపవోయి
సౌందర్య మెగజిమ్ము స్వర్ణదీపాలు
వెలిగింపరా సాహిత్య వీధులందు ।

బీడులై పడియున్న భూములందీవు
తరలింపరాగంగ కరువు తీర్పంగ
క్రొత్త సూత్రాలతో కూర్చి సేద్యాలు
బంగారు రాజనాల్ పండింపవోయి

దారిద్ర్య దాస్యముల్ తలపగాబోని
పాడి పంటలతోటి వర్ధిల్లవోయి
స్వాతంత్ర్య భరతదేశమ్ములోనీదు
స్వేచ్ఛాంధ్ర గేయాలు వినిపింపవోయి ।

★

ఏగా కృష్ణరాయా ?

వందే మాతరమ్

సుజలాం సుఫలాం మలయజ శీతలాం
వినదించిన జగతీ గీతములో
జనియించిన శ్రుతిమయమూర్తీ!
తిరిగి రావయ్యా తెలుగునేలకు!

మూడు కోట్ల తెలుగు గుండెలు
మ్రోగించిన రాష్ట్రోద్యమ రవళికి
కవివై గాయకుడవై కళాశిల్పివై
కవితావాద కళారూపాలతో
పత్రిక నడిపించిన ప్రతిభామూర్తీ!

నీయెద తపించిన తెలుగు వెలుగు
రాకమున్నే — రాకపోకలులేని
లోకాలకై పయనించితివా?
ఆకాశపు కొసల ఏకాంతమా?

జీవితపు లోతులు వెదకి, వెదకి
తల మెరసిన తాత్త్విక మూర్తీ
తరలిపోవ తరుణం కాదయ్యా!
తిరిగి రావయ్యా తెలుగు నేలకు!

దేశసాహిత్య దీపాలు వెలిగించి
దివ్యస్వాతంత్ర్య భావాలుకలిగించి
కోతకువచ్చిన నీ తెలుగుపంట వదలి
తరలిపోయే తరుణం కానేరదయ్యా

మా కృష్ణరాయా! ఓపూజనీయా!
మరలిరావయ్యా మాతృభూమికి
వందే మాతరమ్
సుజలాం సుఫలాం మలయజ శీతలాం.

★

స్వాగతం

ఓహో క్రాంతిదాతా!
ఓయీ శాంతి దూతా!
శాంతిమయ జగతీ
స్వాదు భరపదగీతా!
దేశమును ప్రేమించు
దివ్య భావాలతో
సౌందర్య భరితమౌ
శాంతిరూపాలతో
భువనాలు నీవుగా
అవతరిస్తున్నావు!
నరలోక జయకావ్య
మవధరిస్తున్నావు!

★

బ్రతుకు కడలీ తరచి
మృదు మధుర సుధతో
హాలాహలమునైన
ఆచమించే శక్తితో
తరుణారుణ కాంతిలో
తరలి వస్తున్నావోయి

ధరణి సర్వము క్రొత్తగా
పెరిగి వస్తున్నావోయి

★

ఈ పాత భువనాలు
ఎవరి నెత్తుట కట్టిరో ?
ఈ రాజ చరితలు
ఎవరి నెత్తుట వ్రాసిరో ?
ఆ రక్త ధుని శీకరాలె
అగ్నులై వర్షించుతావు
జన్మజన్మాలలో పోరలు
అన్యాయ మెదిరించుతావు

★

విద్రోహ రౌద్రాలు
విద్వేష పాశాలు
అధికార దాహమే
రక్తాన్న కాంక్షలై
సంక్షుభితమౌ జగతిలో
శాంతి నెలకొల్పుతావు
అంత రాంతర వహ్ని
కాంతి ప్రసరించుతావు

★

శ్రమియించు వారిదే
సర్వమను కాంక్షతో

వెలిబడిన నర జాతికై
విలువ దెచ్చే దీక్షతో
భూదేవి పుణ్యాలనే
పుడిసెళ్ళ తెస్తాహోయి
జలధి గర్భము చీల్చి
మొలక వజ్రాలు తెచ్చేవు।

★

నీ యెలుగు వినలేని
నీ వెలుగు కనలేని
బధిర గర్వాంధులీ
పథములో నిలువరోయ్
నీదు గంభీరవాణియే
ప్రణవమై మ్రోగురా।
నీ మహోజ్జ్వల తేజమే
నిఖిలమై నిండురా।
ఓహో క్రాంతిదాతా।
ఓయీ శాంతి దూతా.
సుందరోజ్జ్వల జగతి
సృష్టించు మానేతా।।

★

కాంక్ష ★ మూలం : శ్రీమఖన్‌లాల్‌చతుర్వేది

ఓహో వనమాలీ!
ఓయి వనమాలీ!
నవ్వు వెన్నెల అలలవూగే
జవ్వనీ వేణీ భరముపై
నిలిచి- కులకాలను కోరికా
లేదోయీ........లేదోయీ
కలకాల మిలా తలమేలిన
ఘన చక్రవర్తి కంకాళముపై
విలసిల్లాలను వేడుకా
లేదోయీ....లేదోయీ
కనక గోపురాలయములో
దివ్యసుందరు శిరముపై
తేజరిల్లాలను కాంక్ష
లేదోయీ....లేదోయీ
ప్రియురాలి మెడలోని
పూలమాలలో పూవునై
పులకరించాలను మోదమూ
లేదోయీ....లేదోయీ
మాతృభూమికై మరణింపగ
వీరయోధులు వెడలీవచ్చే
కాలి బాటపయి నను
విసరి వేయు మోయీ!
వెదచల్లవోయీ!
ఓహో వనమాలీ!
ఓయి వనమాలీ!

విప్లవాత్మ

మూలం : శ్రీ మలీహాబాదిగారు

ఈ వసుంధరపై ఎడతెగని దుఃఖముద్రికలు
ఈ సిరిసంపదలు శోకాగ్నికి ప్రతిబింబములు
ఈ బ్రతుకు బాటలపై కన్నీటి వెల్లువలు
ఇట్టి విషాద విశ్వమునే భూతలస్వర్గంగా
నిర్మించేందుకు విప్లవోత్సాహ ప్రయత్నం
చేస్తున్నది.... ....విప్లవాత్మ !

౨

మంచుతెరలలో ప్రాణికోటి మాటుమణిగినది
స్వాప్నికుని స్వర్గసౌందర్యం మాసిపోతున్నది
వేదాంతుల పవిత్ర పరిషత్తులు మూగవోతున్నవి
వ్యథాపూరితమౌ యీ లోకాలోకనమే తన
హృదంతరాగ్నిజ్వాలను ప్రజ్వలింపచేస్తున్నది

౩

సరస సంగీతనృత్యాలు రసాంచితకావ్యాలు
ఈ మధుర రుచులన్నీ వెలిబడుతున్నాయి
మూఢాచారములభేరి త్రాహిత్రాహియంటున్నది
ఈ మరణమధ్యేమార్గాన అనంతవేగముతో

ఆదర్శసంజీవినిగొని పరుగిడుతున్నది
బ్రతికిస్తున్నది.... ....విప్లవాత్మ !

౪

ఈ క్షమామూర్తి క్రూరతాడనముల నలసినది
తన అంగాంగములపై కత్తి నాట్యమాడుతున్నది
తనమొగం తరతరాలధూళి నిండిపోయినది
తన లలితమనోవీణాతంత్రి యల్లాడుతున్నది
ఐనా—మహోజ్జ్వల విప్లవభావమొకటే ప్రకాశిస్తున్నది

౫

పవిత్రస్వేచ్ఛామయమగు తన జీవితముపై
సనాతనుల శాసనాలు నిరంకుశ దౌర్జన్యాలు
మరణానంతర స్వర్గనరక కాంక్షాంక్షలు
శతవిధాల శక్తిని హరిస్తున్నా. వేధిస్తున్నా
తన విప్లవ రథాన్ని నడిపిస్తూ వెళుతున్నది

★

వంగరాష్ట్రమా!

మా వంగ రాష్ట్రమా ! మా దేశ మకుటమా !
విశ్వకవి బంకిమ్‌ల విజ్ఞాన సౌధమా !

కరువురాకాసి తా
గజ్జె కదిలింపగా
కాడు బీడాయెనా
కలకత్త నగరమ్ము ? ॥మా॥

తిండి దొంగల చలవ
పట్టెడన్నమె లేక
ప్రాణాలు విడిచిరా
నిరుపేదలౌ ప్రజలు ! ॥మా॥

ప్రజల సహకార
ప్రాబల్యమేలేక
ఆహార సంక్షోభ
మది చల్లారునా ? ॥మా॥

కడుపు మాడినచోట
కనిపించునా మతము ?
ఐక్యతా సాధనమె
అంత్యవిజయముసుమా ! ॥మా॥

దేశరక్షణలోనె
జాతిస్వాతంత్ర్యము
ప్రజల సహకారమే
ఐక్యతా విజయము ! ॥మా॥

మా వంగ రాష్ట్రమా !
మా ప్రియ రాష్ట్రమా !!

విశాఖ వేదన

చేయెత్తి సాయమూ
చేసిపో బాబయ్యా !
జే జే లివేమీకూ
స్వీకరించండయ్యా !

కానికాలామొచ్చి
కష్టపడుతున్నాము
కడుపుమంటలతో
కాలిపోతున్నాము—

రంగాన్న మావారు
రాకపోకలులేవు
మాగోడు చూసేటి
మారాజు లేదయ్యా !—

వానచుక్కా లేక
పంట పాడయ్యాది
మార్కెట్టు ధరలూ
మండిపోయాయి—

మాపాలి ' సంద్రయ్య '
కోపాన పొంగాడు
పరిగపిల్లానైన
పట్టుకోనియ్యడు !—

'అమ్మోరు' వచ్చింది
అందరిని మింగింది :
'ఉష్ణాలు' వచ్చాయి
ఉడుకెత్తి పోయాము !—

పథ్య పానాలకు
పచ్చివులవలె దిక్కా ?
పాడు రోగాలతో
మాడిపోయామయ్య !—

పండినా పంటంతా
మాయమై పోయింది !
తిండి దొంగల కొట్లు
తెగ నిండిపోయాయి—

పోగు పుస్తెలుకూడ
తెగనమ్మి తిన్నాము !
కంచాలు మంచాలు
కదకమ్మి వేశాము !—

ఉన్న పైసాలన్నీ
మున్నె చెల్లాయి
తిండి దొంగల చలవ
జోగులై నిలిచాము !—

ఆకలీ జూదాలు
అంగళ్లు తెరిచారు !

మా ప్రాణ మానాలు
ఫణముగ వోడాము !—

కట్టు బట్టా లేక
తిండి తిప్పలులేక
ఎన్నాళ్లు మే మిట్లు
వేగుతూ వుంటాము ?—

పిల్ల వదిలీ తల్లీ
తల్లి నొదిలీ పిల్లా
ఆలి వదలీ మొగుడూ
వలసెళ్ళి పోయాము—

వెలలేని మానాలు
వీధి వీధులబెట్టి
పదిరెండు పైసలకె
బలిపెట్టు కొన్నాము—

పండి నిండిన బాబూ !
కడుపు నిండిన తల్లీ !
చే యెత్తి సాయమూ
చేయగా రా రండి !

★

ధాన్యలక్ష్మి

నన్నొదిలి పెట్టెళ్ళినావా ?
నా రైతా !
ఎన్ని కడగళ్లు కన్నారా !

మాయదారీ బేరి
మాయలో పడిపోయి
అన్నదాతా ! నీవు
నన్నమ్మి కొన్నావ ?

నీ చేతి చలవకై
నిలిచి చూచే జీవి
ఒరిగి పోయే రీతి
యెరుగవా నా తండ్రి ?—

చీకటీ లోయలో
చిక్కుకున్నానోయి
కలవారలే నన్ను
కదిలించ గలరోయి !—

నముదాచి దేశాన్ని
నలిచి వేశారన్న
కరువు రాకాసికే
కళ్లె మొదిలారన్న !—

పొరుగు పల్నాటిలో
ఇరుగు వైశాఖలో
వేలాది నీ ప్రజలు
నేల కొరిగారన్న !

పండి వారిగిన నేను
పయనమై యున్నాను
కడుపు కాలిన ప్రాణి
కను విప్పుకున్నాది !—

తిండిదొంగల గుంపు
తొంగి చూస్తున్నాది
ఆదుకున్నా పంట
అందనీ బోకోయి !—

జాతి ముక్తికి నీవు
సైదోడువోయన్న !
స్వాతంత్ర్య సమరాన
సగపాలు నీదన్న !—

విజయసాధనకింక
వేవేగపడుమన్న !
కనుమూసి కూర్చుంటె
కలకాల దాస్యమే !—

నీ మిగులు ధాన్యాన్ని
నిరుపేద కందించి
నీజాతి ధర్మాన్ని
నెరవేర్చుకొనుమన్న—

నన్నొదిలిపెట్టెళ్ళకోయీ !
నారైతా !
అన్నార్తుల కందింపవోయీ !

మాదాకవళం

మాదా కవళం మాకో కవళం
కడుపునిండిన మామ్మా కవికరించుమా।

ఆకలీ సెగలలో
ఆరనీ పగలలో
అణు వణు వణగీ
ఆత్మాహుతీ అయ్యేం

మాదా కవళం మాకో కవళం
పండి నిండిన బాబా కనికరించరా

మాపై కత్తులుదూసీ
మా యెద నెత్తురుతీసీ
ధన ధాన్యాల్ దోచారూ
దారిద్ర్యం కలిపించారూ

మాదా కవళం మాకో కవళం
కడుపునిండిన మామ్మా కనికరించుమా

మీకు మిగిలిన తిండీ
మాకు వేగ పెట్టండీ
సాటి పేదల మండీ
సాయ మొనరించండీ

మాదా కవళం మాకో కవళం
కడుపునిండిన బాబూ కనికరించండీ।

★

నవోజ్జ్వల యుగారంభం

పరపీడనావ్యధల పాలబడినావాడా !
పరిపూతమౌదినము పయనమైవచ్చింది
నిను దోపిడీచేసి నీగొంతు నొక్కేసి
నీ గుండెలనుచీల్చి నీ నెత్తురునుబీల్చి
కలకాలముగ నిన్ను కరకు రాకాసులు
పాడునరకంబులో బంధించివేశారు
నీ రోధనధ్వని నిర్నిద్రఘోషగా
జాగృతీ కలిగించి జగమెల్ల కదిపింది
ఫలితాలు నేడురా పక్వమై వచ్చాయి
కలగాదురా యిది కఠిన సత్యమ్మోయి

★

జాత్యహంకారాలు సైన్యవిన్యాసాలు
సర్వమానవస్వేచ్ఛ సంహరించేదీక్ష
ఏకాధినేతగా లోకమేలేకాంక్ష
క్రూరలక్ష్యాలతో వారలున్మత్తులై
నీకన్న దేశాల నిప్పులను గురిసారు
ప్రళయకాల మహోగ్రప్రధనాలు నడిపారు
మంచూరియా కొరియా మలయా బర్మా చీనా
సర్వదేశాలలో సర్వమూనీవుగా
ఏషియా అంతటా ఏకమై పొంగావు
జయోద్ధృతశక్తి చాటిచూపించావు

కష్టాలలో మునిగి కడతేరివచ్చువాడా ?
యుగయుగాలదీశక్తి రగులుకొలిపావోయి

★

ఇది నవోజ్జ్వల యుగారంభం
ఇది ప్రజావిజయ సంరంభం
రక్త పిపాసుల రాక్షసరూపాలు
ధ్రువధ్రువాలకు మధ్య తొలగింపవోయి
అన్ని దేశప్రజల ఐకమత్యమ్ముతో
సమైక్య ప్రజాస్వామ్యము సాధింపవోయి
కదిలి పొంగినవాడా ! కదలులేనివాడా
నీగీతివినిపించు ! నీజ్యోతి వెలిగించు
ఓమహోజ్జ్వల విజేతా ! ఓదివ్యనేతా
ఎదురులేదీనాడు ! ఉండబోదేనాడు !

★

నవంబరు 7

(రచన : 7—11—45 న)

జై జై రష్యా
జయజై రష్యా
స్వేచ్ఛా సముజ్జ్వల తపస్వీ
దాస్య వినిర్ముక్త తేజస్వీ
ఓ ధీర రష్యా
ఓ వీర రష్యా
జార్జియన్లు ఆర్మియన్లు ఉజ్బెక్కులు కజ్బెక్కులు
సమస్త జాతుల సమిష్టి సాధనలో
స్వయం నిర్ణయం ఫలించిన రూపంలో
నిర్మించిన సోవియట్లదేశం
నిఖిలావని కొాక సందేశం
గోగల్ టాల్స్టాయ్ పుష్కిన్
గోర్కీ చెకోవ్ కూప్రిన్
కోటి కోటి హృదయాలు
కురియించిన పవిత్ర సత్యం
నడిపించిన నవ్యసమాజమును
ప్రభవించి పాలించిన పవిత్రరష్యా
జై జై రష్యా
జయజై రష్యా
సైబీరియా మైదానం యుక్రైన్ పచ్చిక బయలూ
కాకేషస్ పర్వతం క్రిమియా కొాండలోయలూ
సృష్టించిన ప్రచండారుణ సైన్యం

ఝుకోవ్ వొరొషిలోవ్ టిమ్‌షెంకో
బరోడిన్ బుడెన్నీ నేతృత్వఫలితం
రారాజు రక్త చరిత్రలు
రగిలించిన సమరాలను
పరాధీన జాతుల విముక్తికై
జయించి సాధించిన భూతలస్వర్గం
జై జై రష్యా
జయజై రష్యా
హెర్ మార్కులు పౌండ్‌లు డాలర్‌లు
నా డెదిరించిరి - మరణించిరి
హిట్లర్‌లు ముసులోనీలు టోజోలు
నే డెదిరించిరి - కనుమూసిరి
చరిత్ర సాధించిన యీ సత్యం
గ్రహించని సోమరులు పామరులు
కలకాలం కళ్లు మూయలేరు
జై జై రష్యా
జయజై రష్యా
మానవేతి హాసములో
అమరజీవి నీ లెనిన్
విప్లవ సమర చరిత్రలో
అమరజీవి నీ స్టాలిన్
ప్రపంచ మానవ విజయ యాత్రలో
కార్మిక కర్షక విప్లవ సమరంలో
అధినేతలు నీ పుత్రులు
నిశీధానికి కాంతి ధారలు
జై జై రష్యా
జయజై రష్యా

జైత్రయాత్ర

(బర్లిన్ పతనానికి ముందు రచన.)

అదె రెడార్మి బర్లిన్ పై
పురోగమించింది

తొలిగిరిపై ఉషాదేవి
విజయ మాలాలంకృతయై
ఉదయారుణకిరణ ప్రసారితయై

స్వతంత్రగేయం వినిపించింది
పీడిత హృదయం పులకించింది

అదె రెడార్మి బర్లిన్ పై
పురోగమిస్తున్నది

★

అది జోయా నులివెచ్చని నెత్తురులో
కదిలిన మహోజ్జ్వల ధారావాహిని
అది స్టాలిన్ కనుచూపుల మెరుపులో
పదునెక్కిన విజయోత్సవ వాహిని

అదె రెడార్మి బర్లిన్ పై
పురోగమిస్తున్నది

★

అన్యాయం అజ్ఞానం నిరంకుశత్వం
శివతాండవమాడిన రాజ్యంలో

నిద్రాముద్రిత మానవజాతికి
నిగళచ్ఛేదన మొనర్చినది

అదె రెడ్డార్మి జగన్నాధరధం
ఇదె బర్లిన్ గుండెలపై ప్రధనం

★

మానవుల కొక హక్కున్నదని
మరచి మూగదైన జాతికి
విజయానల కణ కిరణాలతో
వేయివెలుగుల దారులు చూపి
విలయంతో ప్రళయంతో

అదె రెడ్డార్మి బర్లిన్ పై
పురోగమిస్తున్నది

★

జగ జగాల శాంతిచరితలపై
ప్రసిద్ధివహించిన ప్రపంచ విజ్ఞానంపై
జాత్యహంకృతి పారాయణతో
విజయంపేరిట మారణహోమంతో
విజృంభించిన నాజీ నరహంతకులకు
ముగుతాడై ఉరితాడై

అదె రెడ్డార్మి బర్లిన్ పై
పురోగమిస్తున్నది

★

అరుణపతాక

(బృందగానం)

ఎగరేయవోయి
అరుణపతాక!
వినువీధులలో
విజయపతాక!

నవ్యజగత్తులు నిర్మించే
దివ్యచరిత్రలు లిఖియించే
కార్మిక కర్షకులారా!
కరము కరము కలపండోయ్!
ఎగరేయవోయి

....

సమస్త జాతుల స్వేచ్ఛకై
సంకుల సమరం సాగెనురా!
పీడిత మానవులారా!
పదండి ముందుకు రండోయ్
ఎగరేయవోయి

....

నిరంకుశత్వం నిర్మూలించే
పరాన్నభుక్కుల పరిమార్చే
విప్లవ సైనికులారా!

విజయగాములై నడవండోయ్
ఎగరేయవోయ్

....

అనంతమైనది పోరాటం
అధిగమింపగా పోదాం
అమరయాత్రికులారా!
ఆత్మార్పణకై లెండోయ్!

ఎగరేయవోయి
అరుణపతాక!
విను వీధులలో
విజయపతాక!

★

సోదరా!

క్రొత్త రోజిది చూడరా।
సోదరా।
క్రొత్త పాటలు పాడరా।

ఊరకే కూర్చున్న
ఉట్టిపడునా స్వేచ్ఛ?
కలసి పనిచేయుచే
కార్యసాధనమోయీ। ॥క్రొత్త॥

తల నెరసినా మనకు
తలపులే మారవా?
క్రొత్త బ్రతుకులు గోరి
నెత్తు రుడికే వేళ ॥క్రొత్త॥

మనలోని కక్షలవి
పేదలకు శిక్షలై
రాకాసి మూకలకు
రాదారి వేయుచే। ॥క్రొత్త॥

జాతి శీలము చెప్పి
గర్వించు మన చరిత
క్షుధితానలమ్ములో
చూర్ణమైపోయెరా ॥క్రొత్త॥

నైరాశ్య దుఃఖాలు
నడివీధి మరణాలు।
వినిపింపనేలేదో
విలయతాండవఘోష। ॥క్రొత్త॥

భావిభారత చరిత
బంగారు కలలుగా
ఐక్యతా సాధనలో
ఆశారేఖలవిగో। ॥క్రొత్త॥

జాతినేతలమధ్య
సంకోచమున్నాది
మనపైన బాధ్యత
మరికొంత పడ్డాది ॥క్రొత్త॥

లేదు మన కపజయము
వలదురా పిరికితనము
కుహనా పాలనమిక
కూలిపోవు నిజమోయి। ॥క్రొత్త॥

తరుణారుణ సైన్యము
తరలి పోదామోయి।

★

పెద్దోడా!

అందరికి పెద్దయిన నావోడా!
ఈ యేల
అందరిని కలుపుకో లేనోడా!

యీ బూము లీ గంగ
లివి మనయె నన్నావు
పగవాడిపై కత్తి
పట్టి సూపించావు! ॥అంద॥

అన్నలూ తమ్ముళ్లు
అందరొకటన్నావు
అందరికి నేనే
ముందుంటనన్నావు ॥అంద॥

నీ నీడ చలవలో
నిలిచి పెరిగొచ్చాము!
కాలాల నడిసొచ్చి
నీవె మే మయినాము ॥అంద॥

నువులేని సమయంలో
నీపేరు విలిపాము
ఆకలీ ఏడ్పుల్లొ
అణు వణువు కరిగాము ॥అంద॥

కలలోని కతమల్లె
యెనకదంతా మరిసి

ఈ రోజు నీ సూపు
యెనక మల్లిందోయి ॥అంద॥

వట్టి మబ్బుల మల్లె
వొట్టుపోతుండావు
ధమధమల సందట్లో
విను నీవె మరిశావు ॥అంద॥

నీయంత వాళ్ళయిన
నీయింటి మనుసుల్ని
మనసులో యేటుందో
మరిసిపోతుండావు ! ॥అంద॥

సాటోళ్ళ యెలుగులో
సాగిపోతుంటేను
సీకట్లో మనబతుకు
సీకిపోతుండాది ॥అంద॥

నీయింటి వాళ్ళంత
నిలుసుండి వొకటిగా
పగవాడి గుండెల్లో
బల్లెమైపోవాల ॥అంద॥

పిసిన్న బుద్ధుల్ని
లోకు లేటంటారో
తెలిసుండి యికముందు
తెలివితో నడవాల . ॥అంద॥

★

నాంది

మిస్టర్ చర్చిల్ మిస్టర్ ఎమెరీ
ఓడిందెవరో ఓడించిందెవరో
వచ్చేదెవరో ఆపై వచ్చేదెవరో
చరిత్ర తెలిసినవారే చెబుతారు

మీ దేశం మీ ప్రజాకోటి
మా దేశం మా ప్రజావాణి
సాగించిన సమిష్టి పోరాటం
సాధించిన ప్రథమ విజయం

మా పీకలు నొక్కి పొట్టలుమాడ్చి
మాపై జరిపిన మీ నిరంకుశ
అత్యాచారాలకు అన్యాయాలకు
ప్రజలే ప్రాయశ్చిత్తం చేశారు

రవి గ్రుంకని మీ సామ్రాజ్యపు
పునాది గుండెలు కదిలించేసే
ఇదొక చారిత్రక విజయం
చరిత్రలో మీరిక కన్పించరు

గ్రీస్ ఇటాలియన్ యోధులపై
జరిపించిన హత్యాకాండ ఫలితం
ప్రజా విద్రోహ పరాయణుల్లారా!
మిమ్మెక్కించిన ప్రజలేదింపారు

లండన్ పోలెండ్ జర్మన్ ఫ్రాన్స్
ఏ దేశాల్లో ఎక్కడైనా సరే
పీడితులంతా ఒకటేనని
చరిత్ర మరోసారి చెబుతోంది.

ప్రజాబలాన్ని నమ్మలేనట్టి
నరమంత్రపు వేత్తలంతా
మిమ్మణిచిం దా ప్రజలేనని
చరిత్రకు తలవొగ్గుతున్నారు.

మనుష్యుల పీకే రాబందుల్లారా!
మా విజయానికిది నాంది మాత్రమే!
కలకాలం కళంక చరితుల్లారా!
విశ్రమించండిక విస్మృత చరితల్లో.

★

పదండి ముందుకు

(కవాతు పాట)

కారుమబ్బు చీల్చవోయ్
క్రాంతిరేఖ చూపవోయ్
మాతృదేశ ముక్తికై
మరణమైన సరియెనోయ్॥మాతృ॥
జాతివాంఛ స్వేచ్ఛరా
స్వేచ్ఛకొరకు పోరరా
సర్వ జాతులైక్యమై
సాగినడువ ముక్తిరా ॥సాగి॥
నేలహక్కు ప్రజలదే
నీటి హక్కు ప్రజలదే
ప్రజల దోచు దోపిడీంద్ర
బ్రతుకు లెత్తి చూపరా ! ॥బ్రతుకు॥
భారి యంత్రాలన్నియున్
ప్రభుత పరము గావలెన్
పాలనాధి కారముల్
ప్రజలవశముగావలెన్ ॥ప్రజల॥
మనల జీల్చు వారలన్
మనల గూల్చు క్రూరులన్
దయను చూప బోకురా
ధర్మమదియె నీకురా ॥ధర్మ॥
మనదు లక్ష్య మల్లదే
విజయ గీతి పాడవోయ్
వీర ధర్మ మల్లదే
వెనక చూడ కడుగువేయ్ ॥వెనక॥

అనంతయాత్ర

వెళుతున్నాం పోతున్నాం
పోతున్నాం వెళుతున్నాం
ఉన్నవారికీ లేనివారికీ
తిన్నవారికీ తిననివారికీ
ఉన్నదెవరిదో లేనిదెవరికో
తెలిపేటందుకు తీర్చేందుకు
కలలురాని వెలుగులోకి
వెళుతున్నాం పోతున్నాం

ఎవరయ్యా సృష్టికర్తలు ?
ఎవరయ్యా సృష్టిహర్తలు ?
కారయ్యా హరికేశవులు !
శ్రమియించువారే కర్తలు
శ్రమదోచువారే హర్తలు
భ్రమియించే బాబుల్లారా !
పరికించండీ నగ్నసత్యం
పిలిచి పిలిచి పోతున్నాం
వెళుతున్నాం పోతున్నాం

ఊహా స్వర్గోపాసకులారా
ఊరటపడి ఆరటపడి
దిగబడి పోతున్నారా ?

కనువిప్పని స్థాణువులారా
కలవర పడకండోయ్
కదిలి కదిలి కలవండోయ్
వచ్చేవారిని పిలుచుక
వెళుతున్నాం పోతున్నాం

అనంత జీవన సంగ్రామంలో
అంత్యఘట్టము చేరండోయ్
పుట్టినఫలము బ్రతుకు సుఖము
పొందే పరిణితి పొందండోయ్
స్థిరసత్యం పాలించేందుకు
హృదయంమందే యోధుల్లారా।
వెళుతున్నాం పోతున్నాం
విప్లవసిద్ధికి వెళుతున్నాం।

★

మే దినోత్సవం

ఎగురుచున్నది జగతి నిండీ
ఎఱ్ఱనీ నిగనిగల జెండా
కష్ట జీవుల రక్తఝురిలో
కదిలి లేచిన దెర్రబావుటా !

పేగుమాడిన పేదకూలి
బ్రతుకు సాగని బక్కరైతు
సుత్తి కొడవళ్లెత్తి నడువగ
ఎత్తరా ధగధగల జెండా !

క్రూర జారును కూలద్రోసి
కూలి రైతులు కలసి మెలసి
దాని నీడనె తరతరాల
దాస్య బంధము త్రెంచినారోయ్ !

ఏబదయిదేళ్ళ వెనకా
ఎఱ్ఱజెండా నీడ బోరి
వందలాదీ కష్టజీవులు
త్రమంది నారా కథను వినరోయ్ !

౧

దూరదేశము లోనిమాట
చాల కాలము నాటి పాట
నాటి నుండియు నేటివరకు
పాడుచుందురు మే. డె. పాట !

అమెరికా యను దేశమున్నది
అందుగలదు 'చికాగొ' నగరం
షావుకార్లకు పడక టిల్లయి
సర్వ భోగము లందు మునిగి.

బార్లు తీర్చిన పెద్దమేడలు
వన్నె చిన్నెల పూల తోటలు
దుమ్ము రేగని రాచ బాటలు
లెఖ్ఖ లేనే లేవురా!

కూలి నెత్తుట ఓలలాడి
కోట పేటలు కట్టినారోయ్
వారి రక్తమె త్రాగి ధనికులు
పాడు బొర్రలు పెంచినారోయ్!

రెండు రెండే జగములున్నవి
దండి గల్గిన ధనిక జగము
తిండి యెరుగని పేదజగము
రెండు రెండే జగములోయి!

దేశ దేశము లందు ధనికులు
పేదవారల శక్తి దోచి
ఇనుపపెట్టెలు నింపినారోయ్
ధనిక దేవత గొల్చి నారోయ్!

ఇళ్ళ గుళ్ళను గోపురాలు
మళ్ల మాన్యము లా మసీదులు
మరతుపాకులు మందుగుళ్ళు
స్వంతమైనవి షావుకార్లకు!

వారు సైగలు చేసిరేని
వచ్చు పోలీసు ఫౌజులెల్ల
అట ప్రభుత్వము సైతమెపుడు
అండ నుండును షావుకార్లకు।

వారి కెదురుగ నిల్చువారికి
జైలు రాతలు తప్పవోయి
ఎదురు మాటలు పల్కువారికి
బ్రదుకు నూకలు లేనె లేవోయ్।

హత్యచేయుట దోచుకొనుట
నిత్యవృత్తిగ కొంపదీయుట
పాడు రాక్షసి రూపమెత్తి
వారు చేయని దేదిలేదు।

ఇనుప గానుగ లోని చెరకు
పిప్పిపిప్పిగ నలిగి నట్లు
షావుకారుల కాళ్ళక్రింద
పేద వారలు నలిగి పోయిరి.

౨

ఎర్రకలువలు విచ్చినట్లు
ఎర్ర నాయెను తూర్పు దిక్కు
నాడు మే నెల మొదటి తేదీ
నాడు పేదల పండుగయ్య।

దిక్కులెల్లను పిక్కటిల్ల
ఒక్క సారిగ మారుమ్రోగె
'విప్లవం - వర్ధిల్లాలి।
ధనికవాదం - దగ్ధమవాలి'।

ఎర్రజెండా లెగురుచున్నవి
పేదవారలు బార్లు తీర్చిరి!
అరచుచుండిరి గొంతులెత్తి
'విప్లవం - వర్ధిల్లాలి!

ఇల్లు వాకిలి విడిచివారు
ఎందుకోసము వచ్చినారో?
చావుకైనను వెరువబోక
సాగినడిచిరి రాచబాటను

చంటిబిడ్డల చంకకెత్తి
సాగివచ్చిరి పేదస్త్రీలు
ఎచటజూచిన ఎర్రజెండా
లెగురుచున్నవి యాకసమ్మున!

కంచుగొంతులు విప్పిపాడిరి
ఒక్కరీతిగ కూలిపాటలు
"ప్రపంచ కార్మికులారా!
ఏకముగండోయ్! లెండోయ్!!

రోజుకెన్మిది గంటలే యిక
మిల్లుపనులను చేయగలము
ఇనుపయంత్రము లాగ మేము
పగలు రాతిరి చేయలేము!

కూలిచాలక తిండిచాలక
కుమిలి కుమిలీ చావలేము
సృష్టి యెల్లను మనమెచేసి
గంజిలేకనె చావనేల?

మనదుశక్తిని కొల్లగొట్టి
ధనిక ప్రభువులు కులుకుతుంటె
దాస్యమందిక చావలేము
తరలిరండోయ్! సాగిరండోయ్!!

అమెరికాఫ్రిక చైన టర్కీ
ఇండియారబు లెవ్వరైన
కష్ట జీవులు వొకటెనోయి
కదిలిలెండోయ్! ఎదురులేదు!!

సర్వ జాతికి స్వేచ్ఛ దెచ్చే
శక్తి కల్గిన ప్రజలరాజ్యం
హెచ్చు తగ్గులు లేనిరాజ్యం
కొత్తరాజ్యము సృష్టిచేదాం"!!

అనుచు పాటలు పాడినారు
రొమ్ము విరుచుక నడచినారు
ఎర్రనీ ధగధగల జెండా
లెగురు చున్నవి వారిచేతుల!

ఎదురు వచ్చెను పోలిస్‌ఫౌజు
వారిచేతుల మెరయుచున్నవి
మరతుపాకులు సన్నలును
మరణ దేవత కోరలట్లు

3

ఆలుబిడ్డల విడిచివారు
ఏమి చేసిరి? ఏమికోరిరి?
"—రోజుకెన్మిది గంటలేయిక
మిల్లుపనులను చేయగలము—"

ఇంటికోర్కెను పేదవారు
నాటి మేనెల మొదటితేది
షావుకార్లను గోరినారు
కోరినందులకేమి జరిగెను ?

ఒక్కచోటను షావుకార్లు
గూడి కుట్రలు పన్నినారు
మేపియుంచిన ఫౌజుకెల్ల
వారు సైగలు చేసినడిపిరి.

ఆకసమ్మది పగిలిపోవ
'విప్లవమ్మిక వర్ధిల్లాలి'
దిక్కు దిక్కులు మారుమ్రోగ
తిరిగి తిరిగి పలికినారోయ్ !

'కిట్ కిట్ 'మన్నది మరతుపాకి
గుండు వెంబడి గుండుదొరలె
తడిసె నెత్తుట సన్నీలవి
భూమి వణకెను కాలిక్రింద

ఒకరి వెంటనె ఒక్కరొకరు
నేలగూలుచు నున్నరయ్యో !
పేద వారల నెత్తుటేరులు
కందకాలవి నిండిపొంగెను !

వయసు మళ్ళిన ముసలికూలి
వయసు మళ్ళని పడుచుకూలి
వందలాదీ ప్రమందినారోయ్
నాడుమేనెల మొదటితేది !

తడిసె నెత్తుట చేతిజండా
వ్రాలుచున్నది నేలపైన—
మ్రోగుచున్నది వెనుకనుండి
' విప్లవమ్మిక వర్థిల్లాలి ! '

రాచ బాటల వేడినెత్తురు
పారుచున్నది ఏరులాగ
పేదవారలు చచ్చిరనుచు
షావుకారులు కులుకు చుండిరి !

చంటిబిడ్డలతోడ స్త్రీలు
సాగిముందుకు నడచినారు !
బెదురు కన్నుల నెత్తురుబికె
ఎదుట నిల్చెను పోలీస్‌ఫౌజు !

' విప్లవమ్మిక వర్థిల్లాలి !
ధనికవాదం ధ్వంసమవాలి : '
పట్టినేర్పిరి పిడికిలెత్తి
చంటి బిడ్డలకాడవారు !!

నిదురలేచిన ధనిక స్త్రీలు
మేడ ముంగిలి కరుగుదెంచి
పిడికి లెత్తిన పేద బిడ్డల
మేను జలదరింపగచూచిరి

తమ కనీసపు కోర్కె కొఱకై
తమదుప్రాణాల్ ధారవోసి
విశ్వమానవ చరితలోనె
విప్లవానికి ధాతలైరోయి

(6)

దూరదేశము లోనిమాట
నాటినుండియు నేటివరకు
చేయుచుందురు మే - దే - పండగ!
దోపిడీంద్రకు గుండెపగులగ!!

నాడు చికాగో వీధులందున
నేల కొరిగిన వారి దలచి
సర్వదేశము లందునాడు
జరుపుచుందురు వుత్సవాలు!

యుద్ధగాధలు వింటి వెన్నో
రాజ చరితలు చదివితోయి!
ఎవరి కొరకై వారి రక్తము
ఏరు లాయెనో మరువకోయి!

ఆగవలదోయ్! సాగిపోవోయ్
శత్రు గుండెలు చీల్చవోయి
చేయి చేయీ కలిపి వొకపై
దాస్యబంధము త్రెంపవోయి

అదియె విప్లవ సైన్య మదిగో
అరుగుదెంచెను కలియవోయి
సాగి ముందుకు నూత్నజగము
సృష్టి చేయగ పాటుపడవోయ్!

కలిసి కట్టుగ నడిచిరావోయ్
ఎదురువచ్చెడు వాడులేడోయ్
మరణమైన వెనుకచూడక
సమర భూమికి సాగవోయి!

ముక్త కంఠము నెత్తిపాడర!

" విప్లవం - వర్ధిల్లాలి!
ధనిక వాదం దగ్ధమవాలి!
విప్లవమ్మిక వర్ధిల్లాలి!! "
విప్లవం - వర్ధిల్లాలి!

★

1890 సం॥ మే ఒకటవతేది ' రోజుకి ఎనిమిది గంటలే పని ' అన్న నినాదం రూపం తాల్చడానికి అమెరికా ధనికుల మరతుపాకులకు బలి ఐపోయిన వీరులు మిల్లు కార్మికులకథ.

(శ్రీ నరేంద్రశర్మ రచన చదివిన పిదప వ్రాసింది.)

★

నేషనల్ ప్రెస్, నారాయణగుడా, హైద్రాబాదు (దక్కన్.)

44

నేషనల్ ప్రెస్, నారాయణగుడా,
హైదరాబాద్ (దక్కన్.)

46

Check List

Book Number	nPROlF334	Date	13/4/2023
Front Cover	yes	Back Cover	yes
Blank Pages	CI, 44, 45		
Missing Pages	no		
Prepared By	Lakshmi	Cutting By	Lakshmi
Scanned By	Amrutha	Pages	55
Quality Checking	Pragathi		